
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అక్రమ మార్గంలో రేషన్ బియ్యం



గోడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం (ఫైల్)

పేదలకు అందాల్సి బియ్యం పెద్దల పాలయ్యాయి. బడుగుల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం అక్రమార్కుల బొజ్జలు నింపుతున్నాయి. రూ.లక్షల రాయితీ భారం మోస్తూ ప్రభుత్వం రేషన్ బియ్యాన్ని పేదలకు అందిస్తోంది. అయితే బ్లాక్‌మార్కెట్, ఇతర రాష్ట్రాలకు బియ్యం తరలిపోతున్నాయి. బుధవారం రాత్రి పాణ్యం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నంద్యాల ఎంపీ డా. బైరెడ్డి శబరి, పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్‌నాయుడు, రెవెన్యూ అధికారులు చేపట్టిన దాడుల్లో వైసీపీ నాయకులకు చెందిన 600కు పైగా బస్తాల రేషన్ బియ్యం దొరికాయి. ఇది అక్రమదందా తీవ్రతకు అద్దం పడుతోంది. వైసీపీ పాలనలో రేషన్ బియ్యం మాఫియా ఆగడాలు తారాస్థాయికి చేరాయి. అదే పంథా ఇప్పటికీ కొనసాగుతున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ, వైసీపీకి చెందిన ద్వితీయస్థాయి నాయకుల ప్రోద్బలంతో 60:40 చొప్పున అక్రమ ఆదాయాన్ని పంచుకుంటున్నట్లు తెలుస్తోంది. దాడులు చేస్తేనే గోదాముల్లో నిల్వ ఉన్న అక్రమ బియ్యం బస్తాలు వెలుగు చూస్తున్నాయి. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అనధికార షెడ్డులు, బియ్యం గోదాములపై విజిలెన్స్, సివిల్‌సప్లై, రెవెన్యూ అధికారులు దాడులు చేపడితే అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం బస్తాలు దొరికే అవకాశాలు ఉందనే అభిప్రాయం వినిపిస్తోంది.

- యథేచ్ఛగా అక్రమ తరలింపు
- రూ.కోట్లు కొల్లగొడుతున్న వైనం
- బియ్యం మాఫియాకు అధికారుల అండదండలు
- దాడులతో బయటపడుతున్న అక్రమ రేషన్ నిల్వలు

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 5,33,770 తెల్ల రేషన్‌కార్డుదారులున్నారు. చౌక దుకాణాలు జిల్లావ్యాప్తంగా 1204 ఉన్నాయి. తెల్ల రేషన్‌కార్డుదారులకు పౌరసరఫరాల సంస్థ నెలకు 71,995 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నెలనెలా లబ్ధిదారులకు అందజేస్తోంది. ఇదిలా ఉండగా నెలనెలా పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం కాస్తా పక్కదారి పడుతోంది. అక్రమార్కులు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసుకునేందుకు ఏర్పాటుచేసుకున్న ఏజెంట్ల ద్వారా వారి వ్యక్తులను ఇళ్లవద్దకు పంపించి పడి రూ.15నుంచి రూ.26వరకు కొనుక్కుంటున్నారు. మార్కెట్ విలువను బట్టి రేటును నిర్ణయిస్తున్నారు. రేషన్ బియ్యం అమ్మినా, కొన్నా నేరమని తెలిసినప్పటికీ ఈ వ్యవహారం బహిరంగంగానే సాగుతోంది.

రేషన్ బియ్యం అక్రమ నిల్వ కేంద్రాలు

జిల్లాలోని బనగానపల్లెకు చెందిన ఓ ప్రధాన బియ్యం వ్యాపారి ఈ తతంగాన్ని నడిపిస్తున్నాడు. బనగానపల్లె కేంద్రంతో పాటు నంద్యాల, ఆత్మకూరు, వెలుగోడు, శిరివెళ్ల, ఆళ్లగడ్డ, పాణ్యంలలో బియ్యం వ్యాపారులు ఉన్నారు. ఇంటివద్ద సేకరించిన రేషన్ బియ్యాన్ని అక్కడే మూటలుగా కట్టుకొని ఆటోలు, మినీ వాహనాల్లో బియ్యం డంప్ స్థావరాలకు రహస్యంగా తరలిస్తున్నారు. నంద్యాల పట్టణ శివారులో ఎంపిక చేసుకున్న స్థావరాల్లో రేషన్ బియ్యాన్ని డంప్ చేస్తున్నారు. దీంతో పాటు ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని పలు మండలాల్లో రైస్ గోదాముల్లో నిల్వలు ఉంచుతున్నారు. రాత్రిపూట లారీలకు లోడ్ చేసి ఆళ్లగడ్డ మీదుగా ప్రొద్దుటూరు, కడప వైపుగా చెన్నైకి, నంద్యాల, బనగానపల్లె, డోన్ మీదుగా కర్ణాటక రాష్ట్రానికి అక్రమ రవాణా సాగుతోంది. జిల్లాలో దాదాపు 13మంది బియ్యం వ్యాపారులు దందాకు తెరలేపి రూ.కోట్లలో దండుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆయా మండలాల్లోని నిర్మానుష్య ప్రాంతాల్లో తాత్కాలిక రేకుల షెడ్లను ఏర్పాటు చేసుకొని స్టాక్ పాయింట్లుగా మార్చుకుంటున్నారు.

గోదాముల్లో అక్రమ నిల్వలు

బియ్యం అక్రమ రవాణాకు తెరలేపిన అక్రమార్కులు ప్రజలనుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని మూటలుగా లోడ్ చేసుకొని రైస్ గోదాముల్లో, పట్టణ, మండల శివార్లలోని పొలాల్లో రహస్యంగా రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకొని నిల్వ ఉంచుతున్నారు. అదనుచూసి లారీలకు బియ్యం బస్తాలను ఎక్కించి అధికారులకు అనుమానాలు రాకుండా ప్యాక్ చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. మరోవైపు రైస్ మిల్లుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యానికి పాలిష్‌చేసి తిరిగి రైస్‌గా ప్యాకింగ్ చేసి నల్లమార్కెట్లోకి తరలించి జేబులు నింపుకుంటున్నారు. రైస్ మిల్లర్లు బియ్యం వ్యాపారులతో చేతులు కలిపి ఈ దందాను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారుల దాడులతో పాణ్యం, ఆళ్లగడ్డ గోదాముల్లో వందల సంఖ్యలో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం బస్తాలు దొరకడం గమనార్హం. ఇదేవిధంగా జిల్లా వ్యాప్తంగా గోదాములపై మెరుపుదాడులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వ్యక్తం చేస్తున్నారు.



ట్రాక్టర్‌లో రేషన్ బియ్యం బస్తాలు (ఫైల్)

పోలీస్ నిఘాను పసిగట్టి దారి మళ్లిస్తూ

రేషన్ డీలర్లు, సివిల్‌సప్లై అధికారులతో బియ్యం వ్యాపారులు చేతులు కలిపినట్లు తెలుస్తోంది. బియ్యం బస్తాలను లారీల్లో లోడింగ్ చేసిన అనంతరం మార్గమధ్యలో పోలీస్, విజిలెన్స్, ఆర్టీవో అధికారులతో ఇబ్బందుల్లేకుండా ఉండేందుకు వాహనానికి ముందు ఒక కిలోమీటర్‌లో పైలెట్ వాహనంగా ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు లారీని లీడ్ చేస్తుంటారు. పోలీసులు వాహనాల తనిఖీల్లో ఉంటే ముందస్తుగా పసిగట్టి లారీ యజమానికో లేదా అందులో ఉన్న డ్రైవర్‌కు వెంటనే సమాచారం అందించి ఆమార్గం గుండా కాకుండా మరో రహదారివైపు దారి మళ్లించి పంపిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

దాడుల్లో వెలుగు చూసిన ఘటనలు

- పాణ్యం మండలంలోని గోరుకల్లు తాండ, ఎస్సార్బీసీ పక్కన ఉన్న ఓ షెడ్డులో, తమ్మరాజుపల్లెలోని గోడౌన్లలో ఎంపీ, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్, రెవెన్యూ, పోలీస్ అధికారులు చేపట్టిన దాడుల్లో విస్తుపోయే విధంగా 600కుపైగా అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం బస్తాలను గుర్తించారు. కేసులు నమోదు చేసి సీజ్ చేశారు.
- ఆళ్లగడ్డ పట్టణ శివారులో ఓ గోడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యంపై అధికారులు దాడులు చేశారు. అక్రమంగా నిల్వ ఉన్న 256బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని అక్కడ డంప్‌చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు.
- నెల క్రితం నంద్యాల పట్టణ శివారులోని విజయ పాల డెయిరీ వెనుకభాగంలో రేషన్ బియ్యాన్ని డంప్‌చేసి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. 40కేజీలు ఉన్న 195బస్తాలకు పంచనామా నిర్వహించి అధికారులకు పోలీసులు అప్పగించారు.
- వెలుగోడుకు చెందిన వైసీపీ ప్రజాప్రతినిధి బియ్యం వ్యాపారం చేస్తుండటంతో పోలీసులు నిఘా ఉంచి అతడి మిల్లులో ఉన్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.
- బనగానపల్లెలో రేషన్ బియ్యం దందా కేంద్రానికి సంబంధించిన ఓ అక్రమ వ్యాపారి లోడింగ్ చేసిన రేషన్ బియ్యం లారీలను గత ఏడాది విజిలెన్స్ అధికారులు దాడులుచేసి సీజ్ చేసి కేసు నమోదు చేశారు.



అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యాన్ని సీజ్ చేసిన అధికారులు (ఫైల్)



అక్రమ బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీ

యేసు త్యాగాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

- పాదర్లు రెవరెండ్ పాల్‌రాజరావు, నందంఐజక్
- గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రీస్తు సందేశం

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): యేసు క్రీస్తు త్యాగాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని నంద్యాల డయాసిస్ పాదర్లు రెవరెండ్ పాల్‌రాజరావు, రెవరెండ్ నందంఐజక్ పేర్కొన్నారు. నంద్యాల హోలీక్రాస్ కెథడ్రిల్ చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఏసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను తన సందేశంద్వారా వినిపించారు. లోకంలో జీవించినంత కాలంలో మంచి పనులు చేయాలని, శత్రువులను ప్రేమించాలని, క్షమాగుణం కలిగి వుండాలన్నారు. ఏసుక్రీస్తు మానవాళి పాప ప్రక్షాళన కోసం తన ప్రాణాన్ని సైతం సిలువపై విడిచి ప్రేమ, శాంతితో అహింసను జయించవచ్చునినిరూపించి సిలువపై రక్తం చిందించిన సందర్భంగా గుడ్‌ఫ్రైడేగా ఈ దినాన్నిశుభ శుక్రవారంగా పిలుస్తారని చాపిరేవుల అంతోని పుణ్యక్షేత్ర మతగురువుల కిషోర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో చర్చి సెక్రటరీ బైక్ల ప్రభుదాసు, ట్రెజరర్ స్టీఫెన్, కమిటీ మెంబర్లు, మత గురువులు, సహాయ గురువులు, కన్యశీలు,సంఘపెద్దలు, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.



చాపిరేవులలో అంతోని పుణ్యక్షేత్రంలో పాల్గొన్న విశ్వాసులు

ఎనర్జీ ప్రాజెక్టు వరం

- మారనున్న ఉమ్మడి కర్నూలు జిల్లా రూపురేఖలు
- గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు అద్భుతం
- పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఎన్డీయే ప్రభుత్వ ఆర్థిక విధానాలు
- కేంద్ర పునరుత్పాదశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి

కర్నూలు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెకుతో ఉమ్మడి కర్నూలు జిల్లా రూపురేఖలు మారిపోతాయని కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. దేశంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి కనిపిస్తోందన్నారు. ఓర్వకల్లు మండలం గుమ్మితంతండా, పాణ్యం మండలం పిన్నాపురం ప్రాంతాల్లో గ్రీన్‌కో కంపెనీ 6,680 మెగావాట్లతో ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టును గ్రీన్‌కో కంపెనీ నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టు దాదాపు పూర్తయింది. త్వరలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి శుక్రవారం ఉదయం ఆ ప్రాజెక్టును పరిశీలించారు. రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు టన్నెల్, టర్బైన్స్‌ను పరిశీలించారు. అంతకుముందు ఓర్వకల్లు మండలం గని గ్రామ ప్రాంతాల్లో నిర్మించిన సోలార్ ప్రాజెక్టును రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా గ్రీన్ కో కంపెనీ ఎండీ చలమలశెట్టి అనిల్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. అప్పర్ డ్యాం, లోయర్ డ్యామ్, టన్నెల్‌ను మంత్రి క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిర్మాణం అద్భుతమని, ప్రపంచంలోనే తొలి ప్రాజెక్టు ఇదే కావడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీ బైరెడ్డి శబరి, చలమలశెట్టి అనిల్ కుమార్‌తో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రపంచంలోనే ప్రతిష్ఠాత్మకమైన రెన్యువబుల్ ఎనర్జీ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు ఇదేనని అన్నారు. ఒకే ప్రాంతంలో సోలార్, విండ్ జలవిద్యుత్ కేంద్రాలను నిర్మించడం గొప్పతనమన్నారు. ఒకప్పుడు ఎందుకూ పనికిరాని అటవీభూముల్లో దేశానికి గర్వకారణమైన ఈ ప్రాజెక్టు నిర్మాణం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు దార్శనిక నాయకత్వానికి నిదర్శనమని కొనియాడారు. ఓర్వకల్లు ప్రాంతం ఆర్థికవృద్ధిని పెంచుతుందని, మరిన్ని అనుబంధ పరిశ్రమలు రాబోయే అవకాశాలు ఉన్నాయనీ తెలిపారు.



పరిశీలిస్తున్న కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి

మిగతా 7వ పేజీలో

'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'లో భాగస్వాములు కావాలి

కలెక్టర్ రాజకుమారి



నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రతినెలా 3వ శనివారం నిర్వహించే 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమ పటిష్ట అమలుపై జిల్లాఅధికారులు, సంబంధిత మండల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమంలో అందరినీ భాగస్వా ములను చేస్తూ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను, ఇతర ప్రజాప్రతినిధులం దరినీ ఆహ్వానించి పాల్గొనేలా చూడాలని ఎంపీడీవోలు, తహసీల్దార్లను ఆమె ఆదేశించారు. ఈ నెలలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైక్లింగ్ అంశంతో కార్యక్ర మం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని కార్యాలయాల్లో పాడైపో యిన కీబోర్డు, మౌస్, మానిటర్స్, సీపీయూ, యూపీఎస్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల జాబితాను తయారుచేసి ఆర్ఆర్ఆర్ సెంటర్లకు తరలించి రశీదు తీసుకోవాలని సూచించారు.

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు.. విరిగి పడ్డ చెట్లు
- అంధకారంలో పలు గ్రామాలు
- పంటల్లోకి చేరిన నీరు

పాములపాడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో గాలివాన బీభత్సానికి భారీ వృక్షాలు నెలకొరిగాయి. ప్రహరీ గోడలు కూలిపోయాయి. రేకుల షెడ్లు పడిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చేతికి వచ్చిన పంటలు నీటి పాలయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం పాములపాడు మండలంలో వీచిన భీకరమైన గాలులతో పాటు అకాల వర్షం కురిసింది. ఈదురు గాలులకు మిట్టకందాల ఇస్కాల, రుద్రవరం, పాములపాడు గ్రామాల్లో 20కి పైగా కరెంటు స్తంభాలు నేల కొరగడంతో విద్యుత్ అధికారులు గ్రామాలలో కరెంటు సరఫరా నిలిపి వేశారు. దీంతో గ్రామాలు అంధ కారంలోకి వెళ్లాయి. విద్యుత్ అధికారులు దిద్దుబాటు చర్యలకు పూనుకున్నారు. పాములపాడులో కేజీ రోడ్డుపై విద్యుత్ స్తంభంపై చెట్టు విరిగి పడటంతో సరఫరాకు అంతరాయం కలగటంతో పాటు వాహనాలు నిలిచిపోయాయి. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రహరీ కూలి పోయింది. ఎస్సీ కాలనీలో, ఎస్సీ బాలికల వసతి గృహం వద్ద, అలాగే పలు చోట్ల వృక్షాలు నేల కొరిగాయి. అలాగే రైతులు ఆరబోసుకున్న మొక్కజొన్న, మిరప, కందులు తదితర పంటలు అకాల వర్షానికి తడిసి ముద్దవ్వడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పాములపాడుకు చెందిన రైతు సాయికృష్ణకు చెందిన 60 క్వింటాళ్ల కందులు తడిసి ముద్దయ్యాయి.

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు అకాల వర్షం కురిసింది. 20.04 ఎంఎం వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా కొత్తపల్లి, గువ్వలకుంట్ల, బండినాయునిపాలెం, లింగాపురం, సింగరాజుపల్లి, శివపురం, దుద్యాల, నందికుంట తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన గాలి వాన కురిసింది. దీంతో ఆయా గ్రామాల్లో ఇళ్లపై ఏర్పాటు చేసుకున్న రేకులు గాలికి ఎగిరిపోయాయి. కొత్తపల్లి బస్టాండు సెంటరులో మోకాల్లోతులో వర్షం నిల్వగా పారింది. దీంతో వాహనాల రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది.

మిడుతూరు: మిడుతూరు నుంచి నందికొట్కూరుకు వెళ్లే ప్రధాన రహదారిలో పెట్రోల్ బంకు దగ్గర రోడ్డుపై అడ్డంగా కానుగ చెట్టు విరిగి పడింది. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే రాత్రి ఓ యువకుడు నందికొట్కూరు నుంచి మిడుతూరు బైకుపై వస్తూ విరిగిపడ్డ పడిన చెట్టును ఢీకొనడంతో గాయపడ్డాడు. 108 వాహనంలో ఆ యువకుడిని నందికొ ట్కూరు తరలించారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ, జూపా డుబంగ్లా గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. జూపా డుబంగ్లాలోని కాసానగర్, పోలీసుస్టేషన్ వద్ద, తంగడంచలో విద్యుత్తు తీగలపై చెట్టు విరిగిపడటంతో మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.



పాములపాడులో కరెంటు తీగలపై విరిగి పడ్డ చెట్టు



కొత్తపల్లి: మోకాల్లోతు నీటిలో వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు)



మిడుతూరు సమీపంలో రోడ్డుకు అడ్డంగా విరిగి పడిన చెట్టు

అహోబిలంలో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి



కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి స్వాగతం పలుకుతున్న జిల్లా అధికారులు, ఆలయ అర్చకులు

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు, పాణ్యం మండలాల పర్యటన అనంతరం కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అహోబిలం లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. అహోబిలానికి చేరుకున్న కేంద్ర మంత్రిని కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణాతో పాటు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆయన ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాల్లో లక్ష్మీ నరసింహస్వామి, అమృత వల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రంగమండపంలో వేదపండితులు కేంద్రమంత్రికి చిత్రపటాలను, తీర్థ ప్రసాదాలను అందజేసి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆళ్లగడ్డ సీఐలు మురళీధర్‌రెడ్డి, యుగంధర్ బందోబస్తును పర్యవేక్షించారు.

ఎనర్జీ ప్రాజెక్టు వరం



మాట్లాడుతున్న కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి

(5వ పేజీ తరువాయి)

స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తి, నిల్వ, డిమాండ్‌కు సరిపడా విద్యుత్ ఉత్పత్తి ఈప్రాజెక్టు లక్ష్యమన్నారు. పర్యావరణ వనరులు దెబ్బతినకుండా విద్యుత్ ఉత్పత్తి చేయడం ప్రస్తుత భారతదేశానికి ఎంతో అవసరమని తెలిపారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ పదేళ్ల క్రితం దేశంలో 18,700 గ్రామాలకు కరెంటు అన్నది తెలియదని, ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక పల్లెపల్లెకు కరెంటు సౌకర్యం కల్పించామన్నారు. పీఎం సూర్యఘర్ ద్వారా పేదలకు తక్కువ చార్జిలకు విద్యుత్ విని యోగించుకునే అవకాశం తీసుకువచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల ప్రజలు పేదరికం నుంచి బయట పడుతున్నారని, ఆ దిశగా ఆర్థిక విధానాలు అమలు చేస్తున్నామని వివరించారు. నీటిని మళ్లీ విని యోగించుకొని విద్యుత్ ఉత్పత్తి చేయడం గొప్ప విధానమని కొనియాడారు. ఇలాంటి యూనిట్ల వల్ల దేశం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఇలాంటి ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం ఆహ్వానిస్తుందని గుర్తు చేశారు. ఓర్వకల్లు మండలంలోని గ్రీన్‌కో కంపెనీ నిర్మాణం చేసిన ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు 60 సంవత్సరాలు పైగా పని చేసే సామర్థ్యం ఉందని త్వరలోనే పూర్తి సామర్థ్యంతో పని చేస్తుందని వివరించారు. కేవలం సోలార్ విద్యుత్‌పైనే ఆధారపడకుండా గాలిమర విద్యుత్, నీటిని ఉపయోగించుకుని విద్యుత్ వినియోగించుకోవాలనే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 4వేల మెగా వాట్ల సౌర విద్యుత్, వెయ్యి మెగావాట్ల పవన విద్యుత్, 1,680 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్ ఉత్పత్తి చేస్తుందని తెలిపారు. గ్రీన్‌కో కంపెనీ హైడ్రోజన్ పవర్‌గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టులపై పని చేస్తున్నారనీ, దేశంలోని 20 రాష్ట్రాల్లో ఈ సంస్థ వీటిని ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, కర్ణాటక రాష్ట్రం చిక్‌బల్లాపూర్ ఎంపీ సుధాకర్ రెడ్డి, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, కర్నూలు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ఇన్‌చార్జి అంకాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీని భ్రష్టు పట్టించిన వైసీపీ

బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్



ఓర్వకల్లు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ టీటీడీని భ్రష్టుపట్టించిందని టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మండలంలోని హుశేనాపురం గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ హయాంలో టీటీడీ గోసంరక్షణ శాలలో జరిగిన ఘోరాలు అన్నీఇన్నీ కావన్నారు. చనిపోయిన ఆవులు, దూడలను నిర్దాక్షిణ్యంగా చెత్త బుట్టలో పారేశారన్నారు. చాలా చోట్ల గోవులు లేకుండానే దాణా కొనుగోలు అంటూ భారీ ఎత్తున అవినీతి చేశారని ఆరోపించారు. చాలా చోట్ల గోవులు లేకుండానే దాణా కొనుగోలు అంటూ భారీ ఎత్తున అవినీతికి పాల్పడ్డారన్నారు. గోవులకు నాసిరకం దానా, కాలం చెల్లిన మందులు ఇచ్చి నోరు లేని మూగజీవాల ప్రాణాలను వైసీపీ ప్రభుత్వం తీసుకుందన్నారు. గోవులు మరణించిన ఆ లెక్కలు బయటకు పొక్కకుండా తొక్కి పెట్టారని, ఈ అరాచకాలకు అప్పటి గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డినే బాధ్యుడు అని అన్నారు. అక్రమాలు బయట పడుతాయన్న ఉద్దేశంతో విజిలెన్స్ అధికారులను గోశాలలోకి రాకుండా ఇష్టానుసారం వ్యవహరించారన్నారు. జగన్ పాలనలో టీటీడీ ఐటీ వ్యవస్థను భ్రష్టు పట్టించారన్నారు. భక్తులకు సేవలందించేందుకు అంతర్గత పాలన సక్రమంగా నిర్వహించేందుకు కీలక విభాగాల్లో జనరల్ మేనేజర్ పోస్టును వైసీపీ అనుకూల వర్గానికి అర్హత లేని వ్యక్తికి ఇచ్చిందని ఆరోపించారు. టీటీడీ బోర్డు మాజీ ఛైర్మన్ భూమన కరుణకర్ రెడ్డి గోవులు మరణించాయని ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కేవీ మధు, జీకే సుధాకర్, మహబూబ్ బాషా, గువ్వ రవికుమార్, బజారు, తదితరులు ఉన్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

బనగానపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామతీర్థం గ్రామానికి చెందిన పండ్లాపురం బషీర్ అహమ్మద్ (45) శుక్రవారం పిడుగుపాటుకు పొలంలోనే మృతి చెందారు. వివరాలు.. బషీర్ అహమ్మద్ మొక్కజొన్న పంట వేసిన తర్వాత భార్య ఖాజాబీతో, మరికొంత మంది కూలీలతో మొక్కజొన్న పొలంలో చెత్తా చెదారం ఏరివేయడానికి వెళ్లారు. భార్య, కూలీలు చెత్త ఏరి కుప్పలు పెడుతుండగా బషీర్ అహమ్మద్ మొక్కజొన్న కుప్పలకు మంట పెడుతూ కాల్చివేస్తున్నారు. ఈసమయంలో ఒక్కసారిగా భారీగా ఉరుములు, మెరుపులు రావడంతో పాటు పిడుగు పడడంతో పొలంలోనే బషీర్ అహమ్మద్ కుప్పకూలి మృతి చెందారు. ఒక్కసారిగా భర్త పొలంలో మృతి చెందడంతో ఖాజాబీ, వారి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

ఆత్మహత్యకు యత్నిస్తున్న

మెడికోను కాపాడిన ట్రైనీ ఐపీఎస్

రామచంద్రాపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం పీవీపురం సమీపంలోని మామిడితోటలో ఆత్మహత్యకు యత్నిస్తున్న మెడికోను ట్రైనీ ఐపీఎస్ హేమంత్ గురువారం రాత్రి 10 గంటలకు కాపాడారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. నంద్యాలకు చెందిన ఓ విద్యార్థి తిరుపతిలో వైద్య విద్య చదువుతున్నాడు. పీవీపురం సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న మామిడి తోటలో ఆత్మహత్య చేసుకుంటానని గురువారం సాయంత్రం తన స్నేహితులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. వీరిచ్చిన సమాచారంతో రామచంద్రాపురం పోలీసులు స్పందించారు. ఆ మెడికో లొకేషన్‌ను ట్రేస్ అవుట్ చేసి 20 నిమిషాల్లో సిబ్బందితో కలిసి ట్రైనీ ఐపీఎస్ హేమంత్ ఘటనాస్థలానికి చేరుకుని ఆ విద్యార్థి ప్రాణాలను కాపాడారు. అతడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. తిరుపతిలో ఆ విద్యార్థి సమీప బంధువు ఉండటంతో ఆయన్ను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అప్పగించారు.



ప్రక్షాళనే లక్ష్యం...!

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా అస్తవ్యస్తంగా తయారైన గ్రామ, వార్డు సచివాలయాలను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు గాడిన పెట్టింది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో భారీ మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలందించాలన్న లక్ష్యంతో పాటు పాలనలో ప్రక్షాళన దిశగా ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోంది. ముందుగా ఉద్యోగుల హేతుబద్ధీకరణపై కసరత్తు చేస్తున్నారు. గ్రామ, పట్టణాల్లో నివాస గృహాలు, కుటుంబాల మ్యాపింగ్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. జనాభా సేకరించి నివేదికలు తయారు చేశారు. ఈ క్రమంలో త్వరలో క్లస్టర్ల విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రస్తుత క్లస్టర్ విధానంలో భాగంగా ప్రతి 2,500 మంది లోపు జనాభా ఉంటే 'ఏ' కేటగిరీ కిందకు చేర్చి సేవలను ఆరుగురు ఉద్యోగులతో కొనసాగిస్తారు. 2,501 నుంచి 3,500 వరకు జనాభా ఉన్న క్లస్టర్‌ను పరిగణలోకి తీసుకుని 'బీ' కేటగిరిలోకి తీసుకువచ్చి అక్కడ ఏడుగురు ఉద్యోగులను కేటాయిస్తారు. ఇక 3,501 మందికి పైగా ఎంతమంది ఉన్నా 'సీ' విభాగంలోకి మార్పు చేస్తారు. ఈ క్లస్టర్లలో 8-10 మంది సిబ్బంది పనిచేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు.

డీడీఓగా ఎవరుండాలి..?

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సంబంధించి జీతభత్యాలు చెల్లించే డీడీఓగా ఎవరు ఉండాలన్న అంశంపై సందిగ్ధత నెలకొంది. జీఓ నంబర్ 11 ప్రకారం ప్రతి గ్రామ పంచాయతీకి ఒక పంచాయతీ కార్యదర్శి ఉండాలి. నిజానికి సచివాలయంలో పనితీరు భిన్నంగా ఉంటోంది. ఇందులో పని చేస్తున్న కొంత మంది సిబ్బందికి ఎలాంటి పని లేకపోగా.. మరికొందరు సిబ్బంది విపరీతమైన పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. కొందరికి సరైన జాబ్ చార్ట్ లేకపోవడం, మరికొందరికి పదోన్నతుల చానెల్ లేకపోవడం వంటి లోపభూయిష్ట పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో జీఓ.నెం.3 ద్వారా సచివాలయాలను ఏ,బీ,సీ కేటగిరీలుగా వర్గీకరించారు. సిబ్బందిని కూడా జనరల్ పర్సన్, స్పెసిఫిక్ పర్సన్ పేరిట వర్గీకరించారు. కాగా ఈ హేతుబద్ధీకరణ ప్రక్రియలో కొంత సందిగ్ధత నెలకొంది. జీఓ.నెం.11 ప్రకారం ప్రతి గ్రామ పంచాయతీకి ఒక పంచాయతీ కార్యదర్శి ఉండాలి. కాగా ఈ హేతుబద్ధీకరణ ప్రక్రియలో ఏ కేటగిరీ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శి లేదా డిజిటల్ అసిస్టెంట్లలో ఒకరు మాత్రమే ఉంటారు. దీని వల్ల సచివాలయానికి జీతభత్యాలు చెల్లించే డీడీఓగా ఎవరు వ్యవహరిస్తారనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం జీఓ ప్రకారం అక్కడ పంచాయతీ కార్యదర్శులు ఉండరు. ఇది రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన గ్రామ పంచాయతీకి కార్యనిర్వహణాధికారి లేకుండా చేయడమే అవుతుంది. ఈ విషయంపై స్పష్టత కావాలని పంచాయతీ కార్యదర్శులు సంఘాలు కోరుతున్నాయి. గత ప్రభుత్వంలో సచివాలయాల నిర్వహణ భారం పూర్తిగా గ్రామ పంచాయతీలపై పడింది. విద్యుత్, ఇంటర్నెట్ బిల్లు, స్టేషనరీ, పరిపాలన నిర్వహణ వ్యయం గ్రామ పంచాయతీ చెల్లించేది. దీంతో తీవ్ర నిధుల కొరత ఎదురైంది. దీనికి పరిష్కారంగా సచివాలయాలను గ్రామ పంచాయతీ వ్యవస్థ నుంచి తప్పించాలని వారు కోరుతున్నారు.

రూపు కోల్పోయిన 'గ్రామ పంచాయతీ'

ఇప్పటికే గ్రామ పంచాయతీ భవనాలు రూపు కోల్పోయి సచివాలయాలుగా అవతరించాయి. పంచాయతీ కార్యదర్శి కొలువు పూర్తిగా క్షేత్రస్థాయి పర్యటనలతో ముడిపడి ఉంటుంది. డిజిటల్ అసిస్టెంట్ల పని కార్యాలయ విధి నిర్వహణతో కూడి ఉంటుంది. వీరిద్దరిలో ఒకరు మాత్రమే సచివాలయంలో ఉంటారనీ, మిగిలిన వారు అదనపు సిబ్బందిగా ఉంటారనీ చెప్పడం స్పష్టత లోపించిన అంశం. ఇక ఇటీవల పదోన్నతుల ప్రక్రియ ఆరంభమైన విషయం తెలిసిందే. ఒక గ్రామ పంచాయతీకి ఒక పంచాయతీ కార్యదర్శి విధానంలో అందరికీ గ్రామ పంచాయతీ కేటాయించినప్పటికీ ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 44 మంది అదనపు పంచాయతీ కార్యదర్శులు మిగిలిపోయారు. ఇక్కడ ఇప్పటికే ఒక పంచాయతీ కార్యదర్శి పని చేస్తున్నారు. పదోన్నతుల తర్వాత అదనంగా మిగిలిన వీరికి గ్రామ పంచాయతీలు కేటాయించాల్సి ఉంది. కానీ అలా కాకుండా డిజిటల్ అసిస్టెంటుగా ఉనన వారికి గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శిగా పదోన్నతి కల్పించి గ్రామ పంచాయతీలు కేటాయిస్తే ఈ అదనంగా మిగిలి ఉన్న పంచాయతీ కార్యదర్శుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ విషయాలు చక్కదిద్దితే హేతుబద్ధీకరణ సవ్యంగా సాగుతుంది. ఇక ఉమ్మడి కర్నూలు జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల పదోన్నతుల విషయంలో కమిషనర్ వారి కార్యాలయం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ప్రస్తుతానికి ఉన్న ఖాళీలతో పదోన్నతులు ఇవ్వాలని పేర్కొంది. అదనంగా మిగులు ఖాళీ ఏర్పడితే రెండో విడతలో ఖాళీలు భర్తీ చేసుకోవచ్చని స్పష్టం చేసింది. దీని వల్ల పంచాయతీ కార్యదర్శులు త్వరితగతిన పదోన్నతులు కల్పించాలని ఉన్నతాదికారులను అభ్యర్థిస్తున్నారు.

- సచివాలయ వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం తొలిఅడుగు
- మూడు కేటగిరీలుగా సచివాలయల వర్గీకరణ
- కేటగిరీల వారీగా ఉద్యోగుల క్రమబద్ధీకరణ
- డీడీఓలపై తొలగని సందిగ్ధత
- అదనపు ఉద్యోగుల పరిస్థితి ప్రశ్నార్థకం

ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేస్తాం



గ్రామ, వార్డు సచివాలయ హేతుబద్ధీకరణ నిబంధనలను ప్రభుత్వం రూపొందిస్తుంది. కమిషనర్ ఉత్తర్వుల అనుసరించి గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లను విభజించడం జరుగుతుంది. ఏ-కేటగిరి గ్రామ వార్డు సచివాలయంలో డీడీఓ అధికారులను ప్రభుత్వమే నిర్ణయిస్తుంది.

- భాస్కర్, డీపీఓ, కర్నూలు



మహనీయుల సేవలు చిరస్మరణీయం


సీడీ ఆవిష్కరిస్తున్న వివిధ ప్రాంతాలకు చెందిన జీయర్ స్వామీజీలు

ఆధ్యాత్మిక సదస్సులో జీయర్ స్వామీజీలు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించిన మహనీయులు ఈ సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు జీయర్ స్వామీజీలు ఉద్బోధించారు. జ్ఞానం, అనుష్ఠానం కలిగిన మహామహులు సదాచార్యులుగా మనకు దొరకడం అదృష్టమని కొనియాడారు. కర్నూలు నగర శివారు మామిదాలపాడులో వెలసిన గోదా రంగనాథస్వామి దేవస్థానం (గోదా గోకుల క్షేత్రం)లో మహా మహోపాధ్యాయ శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్య స్వామి శతజయంతి వేడుకలు ఘనంగా ముగిశాయి. జయంతి వేడుకల్లో పాల్గొన్న జీయర్ స్వామీజీలు మాట్లాడుతూ భగవద్రామానుజ సంప్రదాయ పరిరక్షణ, సంస్కృత, ద్రావిడ వేదాంతముల ప్రచారమే లక్ష్యంగా రఘునాథాచార్యులు జీవన యానాన్ని కొనసాగించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి (భీమవరం), త్రిదండి అహోబల రామానుజ జీయర్ స్వామి, త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి (సమతామూర్తి, ముచ్చింతల్), త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామిజ (విజయవాడ), త్రిదండి అష్టాక్షరీ బృందావన రామానుజ జీయర్ స్వామి, త్రిదండి శఠగోపముని రామానుజ జీయర్ స్వామి (అభినవ మేల్కోట, కర్ణాటక), త్రిదండి ప్రసన్న రాఘవ రామానుజ జీయర్ స్వామి (ప్రయాగరాజ్), ఆచార్య పరమాత్మ నంమదగిరి స్వామి (గంగాపురం), విరజానంద స్వామి (తోట్లపల్లి) భక్తులకు ప్రవచన బోధ చేశారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతల నుంచీ శాస్త్ర పండితులు, వైష్ణవ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గోదా రంగనాథ రామానుజ కూటమి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, గోకులం సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సీమపై ప్రభుత్వ వైఖరిని ఎండగడతాం

● రాయలసీమ సాగునీటి సాధన సమితి

నంద్యాల మున్సిపాలిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమపై ప్రభుత్వ వైఖరిని ఎండగడతామని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవం సందర్భంగా మే 31న సిద్దేశ్వరంలో జరిగే ప్రజా బహిరంగ సభకు తరలిరావాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో శుక్రవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. దశరథరామిరెడ్డి మాట్లాడుతూ సిద్దేశ్వరం ఉద్యమ అనంతరం అలుగు నిర్మాణానికి సానుకూల సందేశాలిస్తూ గుండ్రేవుల రిజర్వాయర్, వేదవతి ఎత్తిపోతల, ఆర్డీఎస్ కుడి కాలువ తదితర నిర్మాణాల శంకుస్థాపన, హంద్రీనీవా ప్రధాన కాలువ వెడల్పుకు పాలనా పరమైన అనుమతులు ఇచ్చిన పాలకులు వాటి పురోగతిపై నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. తెగిన అలగనూరు, అన్నమయ్య ప్రాజెక్టులపై సైతం ప్రతిపాదనలతోనే ప్రభుత్వం కాలం వెళ్లిబుచ్చుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గోరుకల్లు రిజర్వాయర్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవటం సీమపై ప్రభుత్వ శీతకన్నుకు నిదర్శనమని అన్నారు. ఎన్టీఆర్ మానస పుత్రిక తెలుగు గంగ ప్రాజెక్టు పనులు అసంపూర్తిగా ఉండటం సీమ పట్ల పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. జలమే జీవం.. జలమే సర్వం అని చెప్పిన ముఖ్యమంత్రి కరువు, వలసలతో సహజీవనం చేస్తున్న రాయలసీమ ప్రజలను సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేసి కాపాడాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డి, సామాజిక విశ్లేకుడు గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, యాగంటి బసవేశ్వర రైతు సంఘం కన్వీనర్ ఎంసీ కొండారెడ్డి, రైతు నాయకులు శ్రీహరి, నిట్టూరు సుధాకర్ రావు, అలగనూరు రిజర్వాయర్ పరిరక్షణ సమితా నాయకులు ఈశ్వర రెడ్డి తదీతరులు పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏపీఎస్పీ కానిస్టేబుల్ హత్య

- నల్లమల అటవీ ప్రాంతంలో లభ్యమైన మృతదేహం
- పోలీసుల అదుపులో నిందితులు


ఫరూక్ (ఫైల్)

శిరివెళ్ల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో నల్లమల అటవీ ప్రాంతంలో దారుణ హత్యకు గురైన ఓ కానిస్టేబుల్ మృతదేహం శుక్రవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం పెద్ద కందుకూరు గ్రామానికి చెందిన ఫరూక్(36) కర్నూలు ఏపీఎస్పీ 2వ బెటాలి యన్ లో(2013 బ్యాచ్) కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం మంగళగిరి హెడ్ క్వార్టర్స్‌లో ఏపీఎస్పీ(ఆక్టోపస్ విభాగం) కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఈనెల 8వ తేదీన స్వగ్రామమైన పెద్ద కందుకూరుకు వెళ్తున్నట్లు కానిస్టేబుల్ ఫరూక్ మంగళగిరిలో సెలవు పెట్టి వెళ్లారు. ఫరూక్ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు మంగళగిరికి వెళ్లి విచారించారు. కానిస్టేబుల్ ఫరూక్ వ్యక్తిగత సెలవుపై వెళ్లినట్లు అక్కడి అధికారులు చెప్పడంతో వారు ఆందోళనకు గురయ్యారు. దీంతో వారు మంగళగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

మృతదేహమై తేలిన కానిస్టేబుల్ : మంగళగిరిలో నమోదైన కానిస్టేబుల్ మిస్సింగ్ కేసును పోలీసులు నంద్యాల పోలీసులకు సమాచారం అందించడంతో విచారణ వేగవంతం చేశారు. నంద్యాల శివారులోని ఓ ప్రాంతంలో ఓ మహిళతో కానిస్టేబుల్ ఫరూక్‌కు వివాహేతర సంబంధ ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. దీంతో కొందరు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా నిజాలు వెల్లడైనట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నంద్యాల ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు ఆళ్లగడ్డ-చాగలమర్రి రహదారి మధ్యలో ఫరూక్‌ను హతమార్చి మృతదేహాన్ని మాయం చేసేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. మృతదేహాన్ని అదే రహదారిలోని ఓ గోతిలో పడేసి వెళ్లినట్లు తెలుస్తోంది. అక్కడ మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తారన్న భయంతో తిరిగి మృతదేహాన్ని నంద్యాల-గిద్దలూరు అటవీ ప్రాంతంలో వంతెన కింద పడేసి వెళ్లినట్లు దర్యాప్తులో తెలుసుకున్నారు. దీంతో కానిస్టేబుల్ మృతదేహాన్ని పోలీసులు పంచానామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కానిస్టేబుల్ దారుణ హత్యకు గురవ్వడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నంద్యాల ప్రభుత్వ వైద్యశాల వద్ద మృతుని భార్య, కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఫరూక్‌కు భార్య, పిల్లలు ఉన్నారు. ఆయన కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని శిరివెళ్ల ఎస్ఐ చిన్న పీరయ్య వెల్లడించారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

అంకాలమ్మకు పూజలు

శ్రీశైలం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోక కల్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. ఈ పూజలలో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అలంకరణ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న సంప్రదాయ నృత్య ప్రదర్శనలు

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్య కళారాధనలో శుక్రవారం నందికొట్కూరుకు చెందిన సాయి నృత్యకళాశాల వారిచే సంప్రదాయ నృత్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గాతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

మహానందిలో పల్లకీ సేవ

మహానంది, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):, మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీ సేవను ఆలయ వేదపండితులు, అర్చకులు వేదమంత్రోచ్ఛరణతో ఘనంగా నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ఆర్ఎస్ శ్రీనివాసులు, పసుపుల సబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొలను భారతి క్షేత్రంలో భక్తుల సందడి

కొత్తపల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నల్లమలలో కొలువైన కొలను భారతి అమ్మవారి క్షేత్రంలో భక్తజన సందడి నెలకొంది. శుక్రవారం మూలనక్షత్రాన్ని పర్వదినం సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చి సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో రామలింగారెడ్డి ఆదేశాల మేరకు పురోహితులు ప్రాతకాల సమయంలో అమ్మవారిని చారుఘోషినీ నదిజలాలతో అభిషేకించి ప్రత్యేక పూజాది క్రతువులు చేశారు. ప్రధానంగా అమ్మవారికి పంచసూక్తములతో అభిషేకాలు, కుంకుమార్చన, పుష్పార్చన, మహా మంగళహారతి, అష్టోత్తర శతనామ కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే మూలనక్షత్రం కావడంతో అమ్మవారి సన్నిధిలో 46 మంది చిన్నారులకు తల్లిదండ్రులు అక్షర బీజాక్షర క్రతువులు చేయించారు.

'పంట కాలువలు నిర్మించాలి'

కొత్తపల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఎం.లింగాపురం గ్రామ శివారులోని జి.పుల్లారెడ్డి చెరువు నుంచి పంట కాలువలు నిర్మించాలని నీటి సంఘం మాజీ చైర్మన్ చిన్న పుల్లారెడ్డి, రైతులు కోరారు. గురువారం వారు కర్నూలులో ఎంపీ బైరెడ్డి శబరిని వారి స్వగృహంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈమేరకు ఎంపీ స్పందించి త్వరలోనే జిల్లా ఇరిగేషన్, రెవెన్యూ ఉన్నతాధికారులతో చర్చించి చెరువుకు కాలువల నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. చిన్నపుల్లారెడ్డి మాట్లాడుతూ గోకవరం గ్రామానికి చెందిన నేతిమిఠాయిల వ్యాపారి దివంగత జి.పుల్లారెడ్డి తన స్వగ్రామ రైతుల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి సుమారు 15 ఏళ్ల క్రితమే చెరువు నిర్మించారని చెప్పారు. అయితే పంట కాలువలు నిర్మించలేదని చెప్పారు. దీంతో సుమారు 600 ఎకరాల భూములు లీడు భూములుగా మారాయని చెప్పారు. మాజీ సర్పంచ్ రాముడు తదితరులు ఉన్నారు.

గిన్నిస్ రికార్డులో సున్నిపెంట వాసులు



సర్టిఫికెట్లతో తల్లి, కుమారుడు

సున్నిపెంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సున్నిపెంటకు చెందిన తల్లీ, కొడుకులకు గిన్నిస్ రికార్డులో చోటు దక్కింది. వివరాలివీ.. సున్నిపెంటలోని బైబిల్ మిషన్ చర్చి పాస్టరమ్మ మట్ట రత్నకుమారి, ఆమె కుమారుడు మట్ట దేవ నోబుల్ గత ఏడాది డిసెంబర్ 1న హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ స్థాయి పోటీలలో హలేలా సంగీత పాఠశాల తరుపున పాల్గొని కీబోర్డును గంట సేపు వాయించి తమ ప్రతిభ ను చాటారు. ఈ సంగీత పోటీలలో 1046 మంది సంగీత కళాకారు పాల్గొనగా వీరిద్దరికి ఈ అవార్డు దక్కింది. వీరి ప్రతిభను గుర్తించిన వరల్డ్ రికార్డ్ ప్రతినిధులు అనంద్ రాజన్, హలేలు మ్యూజిక్ పాఠశాల వ్యవస్థాపకులు అగస్టీన్ దండగి ఈనెల 14 తేదీన హైదరాబాద్‌లోని చర్చిలో సర్టిఫికెట్స్, మెడల్స్ అందించినట్లు అవార్డు గ్రహీతలు తెలిపారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు నిర్వహించే పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహనాయక్, మండల నాయకురాలు నూర్జహాన్‌లు కోరారు.ఈ మేరకు వారు శుక్రవారం మండలంలోని ఇందిరేశ్వరం గ్రామంలో జరుగుతున్న పని ప్రదేశాలను పరిశీలించి ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఆక్రమణల తొలగింపు



పాణ్యంలో ఆక్రమణలు తొలగిస్తున్న హైవే సిబ్బంది

పాణ్యం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పాణ్యం హైవే సర్వీసు రోడ్డు పక్కన ఆక్రమణలను శుక్రవారం హైవే సిబ్బంది తొలగించారు. సర్వీసు రోడ్డు పక్కనఉన్న బంకులు, హోటళ్లు ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. హైవేకు అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొలగించి వాహన రాకపోకలకు అంతరాయం లేకుండా చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆక్రమణదారులకు పలు మార్లు నోటీసులు అందజేశామని చెప్పారు. ఆరు రోడ్ల విస్తరణలో భాగంగా ఈపనులు చేపట్టినట్లు తెలిపారు. స్థానిక పోలీసుల సహకారంతో ఆక్రమణ తొలగింపు చేపట్టారు.

21న రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని కరివేన గ్రామంలో సీఎస్ఐ సంఘ పెద్దలు, గ్రామ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉదయం డీపౌల్ హైస్కూల్ సమీపంలో 9 గంటలకు రాష్ట్ర స్థాయి పాలబండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 21న ఉదయం 8గంటలలోగా రూ.600 రుసుము చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మొదటి ఏడు నగదు బహుమతులు రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆ రోజు భోజన వసతి ఉంటుందని సీఎస్ఐ సంఘ పెద్దలు తెలిపారు.

మూలన పడేశారు!

- నిరుపయోగంగా కొత్త యంత్రాలు
- వైద్య పరీక్షలకు రోగులను బయటకు పంపిస్తున్న వైద్యులు
- నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో దుస్థితి



స్టోర్ రూమ్‌లో మూలనపడ్డ పల్మనరీ ఫంక్షన్ పరీక్ష యంత్రం



ఇన్‌స్టాలేషన్‌కు నోచుకోని వినికిడి పరీక్ష యంత్రం

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కేంద్రం కావడంతో ప్రభుత్వం రోగుల అవసరాల నిమిత్తం లక్షల విలువచేసే అత్యాధునిక యంత్రాలు మంజూరు చేసింది. అయితే లక్షల రూపాయలు విలువచేసే యంత్రాలు టెక్నీషియన్లు లేక ఉపయోగంలోకి రాక రోగులు అవస్థలు పడుతున్నారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా యంత్రాలు ఉన్నా అవి అమర్చకపోవడంతో రోగులను బయటకు పంపించే దుస్థితి నంద్యాల సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొంది. గత కొన్ని నెలలుగా డయాలసిస్, వినికిడి పరీక్ష యంత్రం, పల్మనరీ ఫంక్షన్ పరీక్ష యంత్రాలు రోగులకు ఉపయోగపడకపోవడం గమనార్హం. ప్రభుత్వ లక్ష్యాన్ని స్థానిక అధికారులు అమలు చేయక తూట్లు పొడుస్తున్నారు. నంద్యాల జీజీహెచ్ స్థాయి పెంచి సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సిన అధికారులు వచ్చిన యంత్రాలను ఉపయోగంలోకి తీసుకురాకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం 450 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసిన జీజీహెచ్‌లో అత్యాధునిక యంత్రాలతో రోగులకు సేవలందించాల్సిన వైద్యులు యంత్రాల కొరతతో ప్రైవేట్‌కు పంపాల్సిన పరిస్థితి నెలకొంది.



ఐసీయూలో నిరుపయోగంగా డయాలసిస్ యంత్రం

ఐసీయూలో అందని డయాలసిస్ సేవలు

ఐసీయూలో డయాలసిస్ కోసం యంత్రాన్ని ఏర్పాటు చేశారు. యంత్రాన్ని అమర్చారే కానీ దాని నిర్వహించాల్సిన టెక్నీషియన్ లేకపోవడంతో ఐసీయూ వార్డులో ఓ మూలన దర్శనమిస్తోంది. ఈ యంత్రం విలువ దాదాపు రూ.10లక్షలు. అత్యవసర సమయంలో రోగులకు డయాలసిస్ చేయాల్సివస్తే వైద్యులు చేతులెత్తేసే పరిస్థితి నెలకొంది. దీంతో డయాలసిస్ కోసం రోగులను బయటకు పంపుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డయాలసిస్ యంత్రం అమర్చి రెండు నెలలవుతున్నా ఇంతవరకు టెక్నీషియన్ లేకపోవడంతో ఒకరికి కూడా డయాలసిస్ చేయలేదు. కేవలం టెక్నీషియన్ లేకపోవడం కారణంగా ఈ మిషన్ మూలనపడింది.

సౌండ్ ప్రూఫ్ రూమ్ లేకపోవడంతో..

వినికిడి పరీక్షా యంత్రం (బేరా) ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి ఏడాదిపైనే అవుతోంది. సౌండ్ ప్రూఫ్ గదిలేక యంత్రాన్ని మూలన పడేశారు. ఈ యంత్రం విలువ దాదాపు రూ.5 లక్షలు ఉంటుంది. వినికిడి లోపం ఉన్న రోగులు నిరుత్సాహం చెందుతున్నారు. ఏడాది అవుతున్నా యంత్రాన్ని ఆస్పత్రిలో అమర్చడానికి అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఇన్‌స్టాలేషన్‌కు నోచుకోని పల్మనరీ ఫంక్షన్ పరీక్ష యంత్రం

పల్మనరీ ఫంక్షన్ టెస్టింగ్ (పీఎఫ్‌టీ) యంత్రం ఆస్పత్రిలో దాదాపు 6 నెలల నుంచి ఇన్‌స్టలేషన్ కోసం వేచి ఉంది. దీని విలువ దాదాపు రూ.10లక్షలు ఉంటుంది. అధికారులు ఇప్పటికైనా స్పందిస్తే రోగులకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. నంద్యాల జీజీహెచ్‌కు టెక్నీషియన్ల నియామకానికి కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్, కలెక్టర్ అనుమతి ఇవ్వాల్సి ఉంది. జిల్లా వేరైనా అధికారం కర్నూలు మెడికల్ కళాశాల పరిధిలోనే ఉండటం, సదరు అధికార యంత్రాంగం అనుమతి కోసం ఇన్ని నెలలు వేచి ఉండటం గమనార్హం. ప్రభుత్వం నుంచి వచ్చిన దాదాపు రూ.25లక్షల విలువైన ఆధునిక యంత్రాలు ఆచరణలోకి తేవాలని రోగులు కోరుతున్నారు.

త్వరలోనే అందుబాటులోకి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు త్వరలోనే అందుబాటులోకి వస్తాయి. ఐసీయూలో డయాలసిస్ సేవలు త్వరలోనే అందిస్తాం. టెక్నీషియన్ నియమించారు. సోమ వారం నుంచి అందుబాటులో ఉంటారు. వినికిడి పరీక్ష యంత్రాన్ని వినియోగంలోకి తెస్తాం. సౌండ్ ప్రూఫ్ రూమ్ కోసం గదిని కేటాయించాం. పనులు చేయించి సేవలు అందుబాటులోకి తెస్తాం. పల్మనరీ ఫంక్షన్ పరీక్ష యంత్రాన్ని ఇన్‌స్టాల్ చేయడం కోసం కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్నాం.

- డాక్టర్ మల్లేశ్వరి, సూపరింటెండెంట్

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- యేసు సందేశాన్ని వినిపించిన పాస్టర్లు





నంద్యాల, ఆత్మకూరులో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. మత పెద్దలు యేసు సందేశాన్ని వినిపించారు.

ఆత్మకూరు: పట్టణంలోని అన్ని చర్చిలలో గుడ్ ఫ్రైడేను నిర్వహించారు. ఉదయం నుంచి క్రైస్తవులు ఉపవాసాలు ఆచారించారు. అనంతరం సమీప చర్చిల్లో పాల్గొని దైవ ప్రార్థనలు చేశారు. ఆయా చర్చిలలో పాస్టర్లు భగవంతుడి ప్రబోధాలను వివరించారు.

సున్నిపెంట: సున్నిపెంటలో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే నిర్వహించారు. బండల బజార్, మార్కెట్, సులేమాన్‌సెంటర్, బస్టాండ్ మీదుగా శిలువ యాత్రను శ్రీశైలం మేరీమాత చర్చి వరకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ స్లీవరాజ్, సింహరాయలు, జాలజయన్న, బాలస్వామి, శ్రీశైల మాత హెచ్ఎం డైసి సింధియా రాణి, పాల్గొన్నారు.

వెలుగోడు: వెలుగోడు పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే నిర్వహించారు. స్థానిక ఆర్‌సీఎం చర్చి నుంచి సిలువను మోస్తూ ప్రధాన రహదారి వెంట భారీ ర్యాలీ నిర్వహించారు. పలు ప్రాంతాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పాణ్యం: మండలంలో శుభ శుక్రవారం వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి ఉపవాసాలతో ప్రార్థనా మందిరాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఈత మట్టలతో క్రైస్తవ కీర్తనలు ఆలపిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. ఆలమూరు సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నందికొట్కూరు: శిలువ ద్వారా ఏసు క్రీస్తు మానవాళికి మహత్తర సందేశం అందిన రోజుగా పవిత్ర శుక్రవారంగా పరిగణించబడిందని నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మారుతి నగర్‌లోని బైబిలు మిషను ప్రార్థన మందిరంలో నిర్వహించిన ప్రార్థన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ క్రైస్తవ సమాజంలో ఈ రోజు ఎంతో పవిత్రమైన రోజు అని ఆమె అన్నారు. ప్రభువు మరణంలో ఒక మనిషి మరో మనిషిని ప్రేమించాలి అనే సందేశం ప్రతిధ్వనిస్తోందన్నారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ చాంద్‌బాషా, లాలుప్రసాద్, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, డా.కాకరవాడ చిన్నవెంకటస్వామి, గుణశేఖర్‌రెడ్డి, బంగారు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● మారుతి నగర్‌లోని బైబిలు మిషను ప్రార్థనమందిరం స్థల విషయంలో 145 నోటీసులు ఇవ్వడం ఏమిటని ఎంపీ శబరి తహసీల్దార్ శ్రీనివాసులను ప్రశ్నించారు. దేవాలయాలు, ప్రార్థనామందిరాలు, మసీదుల వద్ద 145 నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. పరిష్కారమైన సమస్యను మీరు నోటీసులు ఇచ్చి మళ్లీ తిరగదోడడే అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొత్తపల్లి: అన్ని గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడేను కొత్తపల్లి, ఎం.లింగాపురం, శివపురం, సింగరాజుపల్లె, ముసలిమడుగు, ఎర్రమఠం గ్రామాల్లో సీఎస్ఐ సంఘం పాస్ట్రేట్ చైర్మన్ భరత్ దివాకర్ బాబు, గువ్వలకుంట్ల, జి.వీరాపురం, కొత్తపల్లి, గుమ్మడాపురం గ్రామాల్లోని ఆర్‌సీఎం చర్చిలలో ఫాదర్ బెర్నాడ్, దుద్యాల, కొక్కెరంచ గ్రామాల్లోని సీఎస్ఐ చర్చిలలో ఆ సంఘం పాస్టేట్ చైర్మన్ జీవన్ ఇమ్మానుయేల్ దుద్యాల ఏబీఎం చర్చిలో సంఘ గురువు రవికుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేసి యేసుక్రీస్తు సందేశాన్ని వినిపించారు.


మిడుతూరు: మిడుతూరు మండలంలోని ఉప్పలదడియ గ్రామంలో ఫాదర్ మధుబాబు ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే వేడుకనునిర్వహించారు. శుక్రవారం గ్రామంలోని ఆర్‌సీఎం చర్చి వద్ద నుంచి సుమారు 10 గ్రామాలకు చెందిన క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని శిలువను మోసుకుంటూ దిగువపాడు గట్టుపైన వున్న కల్వరి కొండ చర్చి వద్దకు రోడ్డు మార్గాన యేసుక్రీస్తును స్మరించుకుంటూ వెళ్లారు అనంతరం కల్వరి కొండ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ఘనంగా శుభశుక్రవారం జరుపుకొన్నారు. చర్చిల్లో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు జరుపుకొన్నారు. యేసుక్రీస్తు శుక్రవారం రోజే శిలువపై ఎక్కినరోజని, దాని విశిష్టతను మతగురువులు భక్తులకు వివరించారు. అనంతరం గ్రామాల్లో శిలువ ప్రతిమలను ఊరేగించారు.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే వేడుకలను నిర్వహించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గడివేములలోని ఏబీఎం చర్చిలో సంఘ కాపరి జాషువ యేసు సందేశం వినిపించారు.



నంద్యాలలో..



గడివేములలో..



కొత్తపల్లిలో..



నందికొట్కూరులో ప్రార్థనల్లో పాల్గొన్న ఎంపీ బైరెడ్డి శబరి



వెలుగోడులో..



సున్నిపెంటలో..



జూపాడుబంగ్లా: తంగడంచలో..



పాణ్యం: అలమూరులో..



మిడుతూరులో..

కౌలూరులో బీహార్ సర్పంచ్‌ల బృందం



కౌలూరు గ్రామ సచివాలయం వద్ద బీహార్ సర్పంచ్‌ల బృందం

పాణ్యం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలూరు గ్రామాన్ని శుక్రవారం బీహార్ రాష్ట్ర సర్పంచ్‌లు సందర్శించారు. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వ్యవస్థపై అధ్యయనం చేయడానికి ఈ బృందం వచ్చినట్లు కౌలూరు సర్పంచ్ బాలయ్య తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళీశ్వరరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పంచాయతీ వ్యవస్థ తీరుపై అధ్యయనం చేయడానికి బీహార్ నుంచి 35 మంది సర్పంచ్‌లు వచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగా బృందం పంచాయతీ పరిపాలన విధానం, సిబ్బంది పనితీరు, పన్నుల వసూలు, చెత్త సంపద కేంద్రాల వినియోగం, తాగునీరు, పారిశుధ్యం, పంచాయతీ నిర్వహణ, ఆదాయ వ్యయాలు, ప్రభుత్వ సహకారం, సచివాలయం ద్వారా ప్రజా సేవలు వంటి వాటిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రతినిధి నాగేశ్వరరావు ఎంపీటీసీ భాస్కరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాధ, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే



జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

వెలుగోడు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన వెలుగోడు మండలంలోని రేగడగూడూరు గ్రామంలో పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. క్వింటం రూ.3,371లకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట వ్యవసాయాధికారి పవన్ కుమార్, టీడీపీ నాయకులు రాంసుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు: ఎస్పీ



రాత్రి గస్తీని పరిశీలిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. గురువారం రాత్రి ఆయన స్వయంగా విజిబుల్ పోలీసింగ్‌లో పోలీసులను పనితీరును ఆకస్మికంగా పరిశీలించారు. రాత్రి విధుల్లో ఉన్న సిబ్బందితో ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు కృషిచేయాలని సూచించడంతోపాటు చెకింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. రాత్రి గస్తీలోని సిబ్బంది వారి స్టేషన్ పరిధిలో నేరచరిత్ర గలవారిపై, అనుమానితుల కదలికలపై నిఘా వేయాలన్నారు. నంద్యాలను సేఫ్ సిటీగా చేయడమే లక్ష్యంగా ప్రతి పోలీస్ పనిచేయాలన్నారు. పోలీస్ అధికారులు స్టేషన్ పరిధిలోని నేరచరిత్ర గలవారు, అనుమానితుల వివరాలు, వారి అడ్రస్, ఫోన్ నంబర్లతో సహా బీట్‌బుక్‌లో పొందుపరచాలని ఆదేశించారు. ప్రజలకోసం పోలీసులున్నారన్న భద్రతా భావాన్ని వారిలో పెంపొందించేందుకు కృషిచేయాలన్నారు.

పిడుగుపాటుతో గడ్డివామి దగ్ధం

గడివేముల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం వీచిన గాలి, వాన వల్ల అపార నష్టం జరిగింది. రైతులు కలాల్లో ఆరబోసిన ధాన్యం తడిచి పోయింది. బూజనూరు గ్రామ సమీపంలోని కలాల్లోని గడ్డివాముపై పిడుగు పడి మంటలు ఎగిసి పడటంతో గడ్డివాము దగ్ధమైంది. పిడుగు పాటుతో గడ్డివాము దగ్ధమై దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు అలీబాషా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న టీడీపీ, కమిటీసభ్యులు

చాగలమర్రి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టివీడు గ్రామ సమీపంలో శుక్రవారం అభయాంజనేయస్వామి, గణపతి విగ్రహాల ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. వేద పండితుడు ప్రతాప్‌శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నర్సయ్య, సుభద్రమ్మ దంపతులు, మండల సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవి, మాజీ సర్పంచ్‌లు నరసింహారెడ్డి, నారాయణ, టీడీపీ నంద్యాల బీసీసెల్ స్పోక్ పర్సన్ సల్లానాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, రాముడు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రుద్రవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శుక్రవారం జేఈ రాజశేఖర్ తెలిపారు. యల్లావత్తుల, చిన్నకంబలూరు, రుద్రవరం, ఆలమూరు, హరినగరం, చిత్తరేణిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మధ్యాహ్నం 2గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కొలిమిగుండ్ల : మండలంలోని వివిధ గ్రామాల్లో నేడు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జి ఏఈ లక్ష్మణస్వామి శుక్రవారం వెల్లడించారు. సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ కారణంగా ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

21న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో ఈ నెల 21న ఆరో తరగతి ప్రవేశానికి పరీక్ష ఉంటుందని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 100 సీట్లు ఉండగా 119 మంది ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.

నేడు స్వచ్ఛభారత్

బనగానపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మూడవ శనివారం సందర్భంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

సూర్యఘర్ యోజనను వినియోగించుకోండి

డోన్ టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ యోజనను వినియోగించుకోవాలని ప్రభుత్వ విజిలెన్స్ కమిటీ జిల్లా మెంబరు ఏఈ నాగరాజుగౌడు కోరారు. శుక్రవారం మండల విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన కల్పించారు. సోలార్ వాడటం వల్ల వాతావరణ కలుషితం కాకుండా ఉంటుందని తెలిపారు.

వైభవంగా మద్దిలేటి స్వామి తిరుచ్చి

బేతంచెర్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి స్వామి క్షేత్రంలో శుక్రవారం రాత్రి తిరుచ్చి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి, మహాలక్ష్మి అమ్మవార్లకు వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకిలో ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో రామాంజనేయులు, పండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న వృషభాలు

బేతంచెర్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. పోటీల్లో ప్రథమ విజేతగా తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం రామాపురం గ్రామానికి చెందిన అక్షితరెడ్డి ఎద్దులు ప్రథమ విజేతగా నిలిచింది. పోటీల్లో 14 జతల ఎద్దులు పాల్గొన్నాయి. రెండో విజేతగా కర్నూలు జిల్లా కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన శేశాయశ్రేయ ఎద్దులు నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ. పదివేలు, రూ.ఐదువేల నగదును రైతు సంఘం నాయకులు శ్రీధర్ రెడ్డి, రమణారెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు.

ఎస్సీ వర్గీకరణ ఆమోదంపై హర్షం



మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బేతంచెర్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఆమోదం హర్షనీయమని ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకులు అనిల్ కుమార్, మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగశేషు మాదిగ అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కేకట్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంఐఎఫ్ జిల్లా ఆర్థిక కార్యదర్శి ప్రశాంత్, నాయకులు తిమ్మయ్య, మధు, చంద్రమోహన్, సాల్మన్, ఎమ్మార్పీఎస్ నాయకులు శివ, మహేష్, తిరుపాలు, హరీష్, మధు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

బెలుంలో ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెలుం గ్రామంలో వెలసిన మారమాంబ, సత్యమాంబ తల్లి ఆలయాల్లో ఆలయ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ శర్మ బ్రదర్స్ ఆధ్వర్యంలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, ఒడి బియ్యం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

క్షమా గుణమే యేసు నినాదం

- ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ప్రకాష్
- భక్తిశ్రద్ధలతో శుభశుక్రవారం ప్రార్థనలు



చాగలమర్రిలో సిలువ యాత్రలో పాల్గొన్న విశ్వాసులు

శిరివెళ్ల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : క్షమా గుణమే క్రీస్తు నినాదమని యర్రగుంట్ల ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ప్రకాష్ అన్నారు. మండలంలోని యర్రగుంట్ల, శిరివెళ్ల, గుండంపాడు, గోవిందపల్లె తదితర గ్రామాల్లో క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలతో గుడ్ ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో విశ్వాసులు సిలువను మోశారు. ఏసుక్రీస్తు మానవాళికి అందించిన సందేశాన్ని ప్రజలకు వినిపించారు.

ఉయ్యాలవాడ: పాపులను క్షమించటమే యేసుప్రభు నినాదమని ఉయ్యాలవాడ మండల ఫాదర్ జోషిబాబు అన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా మండలంలోని ఉయ్యాలవాడ, ఆర్.పాంపల్లె, సుద్దమల్ల, రూపనగుడి, హరివరం, కొండుపల్లె, అల్లూరు, మయాలూరు తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసు ప్రభు సిలువలో పలికిన ఏడు మాటల గురించి వివరించారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు ప్రార్థనలు కొనసాగాయి.

ప్యాపిలి: పట్టణంలోని సియోన్ ప్రార్థనా మందిరంలో పాస్టర్ సుందరం ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.

బనగానపల్లె: మండలంలోని పలుకూరు, నందవరం, కైప, అప్పలాపురం, టంగుటూరు, నందివర్గం, జిల్లెల్ల తదితర గ్రామాల్లో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడ్ వేడుకలను నిర్వహించారు. అలాగే పట్టణంలోని సీఎస్ఐ చర్చి, మదర్ థెరిస్సా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

కోవెలకుంట్ల: పట్టణంతో పాటు గుళ్లదుర్తి, భీమునిపాడు, దోరాశి, కలుగొట్ల, రేవనూరు, చిన్నకొప్పెర్ల, పెద్దకొప్పెర్ల, వల్లంపాడు, లింగాల, సౌదరదిన్నె, అమడాల, వెలగటూరు తదితర గ్రామాల్లో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే వేడుకలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పెద్దలు సిలువను మోసుకుంటూ వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు శిలువలో ఆయన పలికిన మాటల గురించి సందేశం ఇచ్చారు.

రుద్రవరం: మండలంలో భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు క్రైస్తవులు నిర్వహించారు. పెద్దకంబలూరు, కోటకొండ, చిన్నకంబలూరు, పేరూరు, మందలూరు, నరసాపురం, రుద్రవరం, ఆలమూరు గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్దకంబలూరులో పాస్టర్ జాన్, సంఘకాపరి పెనల స్టాలిన్ సందేశాన్ని వినిపించారు.

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు, పెద్దబోదనం, మద్దూరు, పెద్దవంగలి, గొడిగనూరు తదితర గ్రామాల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడేను ఘనంగా నిర్వహించారు. చాగలమర్రి గ్రామంలోని ఆర్సీఎం, సీఎస్ఐ, మార్తోమా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆర్సీఎం చర్చి ఫాదర్ సిలువ యాత్రను ప్రారంభించారు. పురవీధుల గుండా సిలువ యాత్ర చేశారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులకు గుడ్‌ఫ్రైడే శుభాకాంక్షలు తెలియ జేశారు.



బేతంచెర్లలో..

దొర్నిపాడు: ఆయా గ్రామాల్లోని చర్చిల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడేను నిర్వహించారు. ప్రబోధకులు సంజీవ, తిమ్మయ్య, మనోజ్, ఇమ్మానుయేలు ప్రసంగించారు.

సంజామల: మండలంలోని ఆల్వకొండ, పేరుసోమల, గిద్దలూరు, ఆకుమళ్ల, నొస్సం, కానాల, సంజామల, సీఎస్ఐ చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా కార్యక్రమంలో నొస్సం సీఎస్ఐ చర్చి పాస్టర్ విజయ్ కుమార్, ఆయా సంఘాల నిర్వాహకులు పాల్గొన్నారు.

డోన్ రూరల్: పట్టణంలోని వైఎస్ నగర్‌లో బైబిల్ మిషన్ చర్చిలో పాస్టర్ రెవ.బందెల రాజు క్రైస్తవులకు యేసుక్రీస్తు సందేశాన్ని వినిపించారు. మండలంలోని చిన్నమల్కాపురం, ఎర్రగుంట్ల, గుమ్మకొండ తదితర గ్రామాల్లోని చర్చిల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు.

బేతంచెర్ల: మండలంలోని ఆయా గ్రామాలతో పాటు పట్టణంలో ఆయా చర్చిలలో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి సిలువలను ఊరేగింపు నిర్వహించారు.

డోన్ టౌన్: సర్వమానవాళిని రక్షించేందుకు లోకరక్షకుడైన యేసుప్రభు సిలువను మోశాడని డోన్ సీఎస్ఐ చర్చి పాస్టర్లు రెవ రెండ్ మేకల రాజేంద్రప్రసాద్, రెవరెండ్ సామేల్ బాబు తెలిపారు. శుక్రవారం పట్టణం లోని సీఎస్ఐ చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, క్రైస్తవ సోదరులు, పాస్టర్లు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాల చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడేని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొలిమిగుండ్ల సీఎస్ చర్చి నంది పాస్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని బెలుం, తుమ్మలపెంట, కనకాద్రిపల్లె, కల్వటాల, అంకిరెడ్డిపల్లె, బెలుం శింగవరం తదితర గ్రామాల్లో వివిధ చర్చిలు, ప్రార్థనా మందిరాలకు క్రైస్తవ సోదరులు పెద్ద ఎత్తున తరలివచ్చి, ఏసును ఆరాధిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



కోవెలకుంట్లలో..



రుద్రవరంలో..



ఉయ్యాలవాడలో..



శిరివెళ్లలో..



కొలిమిగుండ్లలో..



డోన్‌లో..

ముగిసిన చెన్నకేశవస్వామి తిరునాళ్ల

బేతంచెర్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గౌరిపేటలోని ఆంజనేయస్వామి ఆలయంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా శుక్రవారం పారువేటతో ముగిశాయి. దేవస్థానం నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో బోయపేట మీదుగా పుల్లమ్మ కల్లం వరకు ఊరేగించారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో పార్వేటను నిర్వహించారు. తరుణ్ అనే యువకుడు విజేతగా నిలవడంతో రూ.1000ల బహుమతిని దేవస్థానం నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో ఈవో మద్దిలేటి, మారుతిశర్మ, పుల్లారెడ్డి, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

దేవుళ్లను అడ్డుపెట్టుకొని రాజకీయం

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్సీపీ నాయకులు దేవుళ్లను అడ్డు పెట్టుకొని రాజకీయాలు చేయాలని చూస్తున్నారని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి విమర్శించారు. శుక్రవారం సాయంత్రం ఆమె అహోబిల క్షేత్రానికి చేరుకొని శ్రీలక్ష్మీనరసింహా స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భూమన కరుణాకర్‌రెడ్డి ఐదు సంవత్సరాలుగా అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారని ప్రశ్నించారు. తిరుమల తిరుపతి దేవస్థానం డబ్బులు మళ్లించినప్పుడు సనాతన ధర్మం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో గుళ్లను కొల్లగొట్టారన్నారు. ప్రజలు బుద్ధిచెప్పారు కాబట్టి ప్రజాసమస్యలపై పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు గూడురు సంజీవరాయుడు, నాయకులు కాకరవాడ చిన్నవెంకటస్వామి, ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జి నరహరి పాల్గొన్నారు.



అహోబిలంలో మాట్లాడుతున్న ఎంపీ బైరెడ్డి శబరి

దొర్వి లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

రుద్రవరం: రుద్రవరం గ్రామ సమీపంలో కొలువుదీరిన దొర్వి లక్ష్మీ నరసింహస్వామి చెంచులక్ష్మి అమ్మవార్లను శుక్రవారం రాత్రి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఎంపీకి ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలోకి వెళ్లి చెంచులక్ష్మి అమ్మవారు, లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. వైద్యసిబ్బంది ఎంపీకి తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. రుద్రవరం నుంచి దొర్వి క్షేత్రానికి వెళ్లే రహదారి, రుద్రవరం నుంచి ఆదర్శపాఠశాలకు వెళ్లే రహదారులను మరమ్మతులు చేయించాలని కోరారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

డోన్ రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకు సిబ్బంది తమ చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని డోన్ అగ్నిమాపక అధికారి ఎం.రంగస్వామి గౌడు అన్నారు. శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని తారకరామ నగర్ ప్రధాన రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకు వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ప్రభాకర్, రాజశేఖర్, నాగేంద్ర, బాబు, హరిప్రసాద్, రంగస్వామి పాల్గొన్నారు.

వాసవీమాతకు విశేష పూజలు

చాగలమర్రి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వాసవీమాతకు విశేష పూజలు చేశారు.మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, కార్యదర్శి ప్రసాద్, ధర్మకర్త లక్ష్మణబాబు, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా దేవతావిగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ

రుద్రవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యల్లావత్తుల గ్రామంలో శుక్రవారం పోలేరమ్మ, అంకాలమ్మ, పెద్దమ్మ, లక్ష్మీనరసింహస్వామి, చెన్నకేశవ, నాగలింగేశ్వరస్వామి విగ్రహాలతో పాటు కలశ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

గుండ్రేవుల ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి

శిరివెళ్ల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గుండ్రేవుల ప్రాజెక్టు సాధనకు రైతులంతా ఐకమత్యంగా ఉద్యమించాలన్నారు. రైతులు పండించిన ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు.

గాలివాన బీభత్సం

- నేల కూలిన నర్సరీ షెడ్డు
- దెబ్బతిన్న అరటి, బొప్పాయి తోటలు



ప్యాపిలి మండలంలోని పీఆర్‌పల్లిలో నేల కూలిన నర్సరీ షెడ్డు

ప్యాపిలి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం అర్ధరాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. బలంగా వీచిన ఈదురు గాలులకు పీఆర్‌పల్లి గ్రామంలో ఇటీవల కొత్తగా నిర్మించుకున్న నర్సరీ షెడ్డు నేల కూలింది. దీంతో రూ.2లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు శ్రీనివాసలు ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే నల్లమేకలపల్లి గ్రామంలో రైతు రాజగోపాల్ నాయుడుకు చెందిన ఐదు ఎకరాల్లో అరటి దెబ్బ తిన్నది. దాదాపు రూ.10లక్షల నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. పీఆర్‌పల్లి గ్రామంలో మామిడి కాయలు నేలరాలాయి.ఈదురు గాలులకు దెబ్బ తిన్న అరటి తోటను ఉద్యానవనశాఖ అసి స్టెంట్ షేక్ షన వాజ్ పరిశీలించారు. పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వా నికి నివేదిక పంపుతామని ఆయన తె లిపారు. ఆయన వెంట రైతు ప్రేమ సాగర్‌రెడ్డి ఉన్నారు.



చాగలమర్రిలో నేలకూలిన బొప్పాయి చెట్లు



బనగాపల్లెలో నేలరాలిన మామిడికాయలు

బనగానపల్లె: మండలంలోని పెద్ద రాజుపాలెం, పసుపుల, చిన్నరాజు పాలెం, పెద్దరాజుపాలెం తండా, చిన్నరాజుపాలెం తండా గ్రామాల పరిధిలో శుక్రవారం సాయంత్రం గాలివాన బీభత్సానికి పది వృక్షాలు విరిగిపోయాయి. బనగానపల్లె- గుత్తి రహదారిలో రోడ్డుపై భారీ వృక్షాలు రోడ్డుకు అడ్డుగా పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పొలాల్లో ఆర బోసిన మొక్క జొన్న పంట తడిసిపోయాయి.

కోవెలకుంట్ల : పట్టణంలో శుక్రవారం సాయం త్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్లతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో ఒక్కసారిగా వాతా వరణం చల్లబడింది. వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు ఈ వర్షంతో కాస్త ఊరట కలిగించింది. మిరప, మొక్కజొన్న కల్లాల్లో ఉండడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు.

రుద్రవరం : రుద్రవరం మండలంలో శుక్రవారం సాయంత్రం గాలి దుమారం బీభత్సం సృష్టించింది. మండలంలోని ఆలమూరు గ్రామంలో వంద ఎకరాల్లో బొప్పాయి తోటల్లో చెట్లు విరిగిపడ్డాయి. ఒక్కో ఎకరాకు రూ.లక్ష చొప్పున వంద ఎకరాలకు కోటి రూపాయలు నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు. రోడ్లపై, పంట పొలాల్లో మొక్కజొన్నలు, వరి ధాన్యం కుప్పలరాశులున్నాయి. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు. రుద్రవరం సమీపంలో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. తీవ్ర నష్టం వాటిల్లింది.

చాగలమర్రి: చాగలమర్రి మండలంలో శుక్రవారం గాలి, వాన జోరుగా వర్షం కురిసింది. చాగలమర్రి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముత్యాలపాడులో భారీ వర్షం కురిసింది. గాలివానతో చాగలమర్రి, గొడిగనూరు, చిన్నబోదనం, చాగలమర్రి సర్వీసు రహదారుల్లో ఆరబెట్టిన మొక్కజొన్న, పంట పొలాల్లో కోత కోసి ఉంచిన నువ్వు, సజ్జ పంటలు తడిచి దెబ్బతిన్నాయి. ఆరబెట్టిన ధాన్యంపై పట్టలు కప్పే ప్రయత్నంలోనే అకాల వర్షం నష్టం కలిగించిందని రైతులు విలపించారు. చిన్నవంగలి గ్రామంలో గాలి జోరుగా వీచడంతో రైతులు సాగు చేసిన బొప్పాయి చెట్లు విరిగి పడ్డాయి. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు.

బనగానపల్లె: మండలంలోని చిన్నరాజుపాలెం గ్రామంలో శుక్రవారం సాయంత్రం భారీగా వీచిన గాలివానకు మామిడితోటలో భారీగా గాలి, వాన బీభత్సంతో మామిడి తోటలు, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా క్రిష్ణగిరి నుంచి చిన్నరాజు పాలెం, పెద్దరాజుపాలెం, పసుపుల తదితర గ్రామాల్లో ఉన్న మామిడి తోటలు దెబ్బతిన్నాయి. మామిడి కాయలు రాలిపోయాయి. మరికొన్ని చోట్ల ఆరబోసిన మొక్క జొన్నలు తడిసి ముద్దయ్యాయి. దీంతో మామిడి, మొక్కజొన్న రైతు కొంత వరకు నష్టపోయారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డలోని పలు గ్రామాలలో శుక్రవారం బలమైన గాలి వీయగా వర్షం పడింది. ముఖ్యంగా అహోబిలంలో వడగండ్ల వాన కురిసింది. దీంతో ప్రజలు, దైవదర్శనానికి వచ్చిన వారు ఆశ్చర్యంగా తిలకించారు. ఎండలు మండుతున్న తరుణంలో వడగండ్ల వాన పడడం ఎంతో ఉపశమనాన్ని ఇచ్చిం ది. తీవ్ర మైన గాలుల కారణంగా అహోబిలం తోపా టు బాచెపల్లె తండా, బాచెపల్లె క్రిష్ణపురం గ్రామాల లో చెట్లు నెలకొరిగాయి. అకాల వర్షం కారణంగా రోడ్ల వెంట ఆరబోసుకొన్న మొక్కజొన్న పంట తడిసి పోవడంతో రైతులు ఆవేదన చెందారు.